నులిమేద్దాం

- ఆల్బెండజోల్ మాత్రల పంపిణీ
- వేసుకోవడం వీలుకాని వారికి 16న అందజేత
- ఏర్పాట్లు పూర్తి చేసిన అధికారులు
- 17 పీహెచ్‌సీల్లోని 826 సంస్థల్లో చిన్నారులే లక్ష్యం
- రెండు నియోజక వర్గాల్లో 82,214 మందికి అందజేత

కపిలేశ్వరపురం: చిన్నారులు ఆరోగ్యంగా ఉంటేనే భావి భారతం బంగారాన్ని తలపిస్తుంది. రోజు వారీ జీవితంలో తీసుకునే ఆహారం, పారిశుధ్య ప్రభావాలకు చిన్నారులు తరచూ అనారోగ్యానికి గురవుతుంటారు. చల్లని కడుపులో నులిపురుగులు ఏర్పడి చిన్నారుల ఆరోగ్యాన్ని చిదిమేస్తుంటాయి. వాటి నివారణకు ప్రభుత్వం ప్రత్యేక కార్యక్రమం చేపట్టింది. నేడు రాష్ట్ర వ్యాప్తంగా నులిపురుగుల నివారణే లక్ష్యంగా 19 సంవత్సరాల లోపు చిన్నారులకు ఆల్బెండజోల్ మాత్రలను పంపిణీ చేసేందుకు సన్నద్ధమైంది. ఆ మేరకు మాత్రలను క్షేత్ర స్థాయిలోని పీహెచ్‌సీలకు చేరవేసింది. రెండు నియోజకవర్గాల్లోని చిన్నారుల్లో రక్త హీనత నివారణే లక్ష్యంగా సాగుతున్న కార్యక్రమంపై ఈ కథనం..

కార్యక్రమ లక్ష్యమిదీ..

జాతీయ నులి పురుగుల నివారణ దినోత్సవాన్ని పురస్కరించుకొని ఏటా అవగాహన, ఆల్బెండజోల్ మాత్రల పంపిణీ కార్యక్రమాలు జరుగుతున్నాయి. ప్రభుత్వ ఆదేశాలు మేరకు గురువారం నుంచి 19 ఏళ్ల లోపు చిన్నారులకు మాత్రల పంపిణీ ప్రారంభంకానుంది. నులి పురుగుల ప్రభావం కారణంగా తలెత్తే రక్త హీనత నివారణ లక్ష్యంగా నిర్వహిస్తున్న కార్యక్రమం వైద్య, ఆరోగ్య శాఖ, విద్యాశాఖ, మాతాశిశు సంక్షేమ శాఖ, పంచాయతీ రాజ్, జిల్లా పరిషత్‌లు సమన్వయంతో కృషి చేస్తున్నాయి. ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలలు, కళాశాలలు, అంగన్‌వాడీ కేంద్రాల్లో మాత్రల పంపిణీ కార్యక్రమం కొనసాగుతుంది.

అవగాహన అవసరం

ఆరోగ్య సిబ్బంది ఇచ్చే 400 ఎంజీ ఆల్బెండజోల్ మాత్రను అవగాహనతో మింగాలి. 2 ఏళ్ల లోపు చిన్నారులు సగం మాత్రను నీటిలో కరగబెట్టి మింగాలి. ఆ పైబడిన వారు పూర్తి మాత్రను నమిలి మింగాలి. మాత్రను పరగడుపున వేసుకుంటే కడుపులో తిప్పడం, వాంతులు అయ్యే అవకాశాలున్నందున ఆహారం తీసుకున్న తర్వాతనే మింగాలి.

రెండు నియోజకవర్గాల్లో సాగేదిలా..

రామచంద్రపురం, మండపేట నియోజకవర్గాల్లోని 17 పీహెచ్‌సీలకు చెందిన 826 సంస్థల్లో 82,214 మందికి మాత్రలను పంపిణీ చేయనున్నారు. రామచంద్రపురం నియోజకవర్గంలోని ఎనిమిది పీహెచ్‌సీల్లోని 395 సంస్థల్లోని 35,046 మందికి మాత్రలను పంపిణీ చేయనున్నారు. మండపేట నియోజకవర్గంలోని 9 పీహెచ్‌సీల్లోని 431 సంస్థల్లోని 47,168 మంది చిన్నారులకు మాత్రలను పంపిణీచేయనున్నారు.

మండలాల వారీగా..

రామచంద్రపురం అర్బన్‌లోని రెండు పీహెచ్‌సీల పరిధిలో 73 సంస్థల్లో 12,636 మందికి, రామచంద్రపురం రూరల్ మండలంలోని రెండు పీహెచ్‌సీల పరిధిలోని 109 సంస్థల్లోని 11,182 మంది చిన్నారులకు మాత్రలను పంపిణీ చేస్తారు. కె.గంగవరం మండలంలోని నాలుగు పీహెచ్‌సీల్లోని 213 సంస్థల్లోని 11,228 మందికి ఆల్బెండజోల్ మాత్రలను అందజేయనున్నారు. మండపేట అర్బన్‌లోని రెండు పీహెచ్‌సీల్లోని 57 సంస్థల్లోని 14,410 మంది చిన్నారులకు, మండపేట రూరల్ మండలంలోని రెండు పీహెచ్‌సీల్లోని 144 సంస్థల్లో 13,665 మంది చిన్నారులకు, కపిలేశ్వరపురం మండలంలోని మూడు పీహెచ్‌సీల పరిధిలోని 131 సంస్థల్లో 8,625 మందికి, రాయవరం మండలంలో రెండు పీహెచ్‌సీల్లోని 99 సంస్థల్లోని 10,468 మంది చిన్నారులకు మాత్రల పంపిణీకి సన్నద్ధమయ్యారు.



అంగర పీహెచ్‌సీలో పంపిణీకి సిద్ధం చేసిన ఆల్బెండజోల్ మాత్రలు

సమన్వయంతో మాత్రల పంపిణీ



ఆల్బెండజోల్ మాత్రలను పీహెచ్‌సీలకు తరలించాం. సిబ్బందికి తగిన సూచనలు చేశాం. క్షేత్ర స్థాయిలోని వైద్య, ఆరోగ్య సిబ్బంది ఇప్పటికే పాఠశాల, అంగన్‌వాడీ కేంద్రాల వద్దకు వెళ్లి అవగాహన కల్పించారు. ప్రభుత్వ శాఖల సిబ్బంది సమన్వయంతో వ్యవహరించేలా ఉన్నతాధికారులు ఆదేశాలిచ్చారు. గత కార్యక్రమాల అనుభవాలు మేరకు మాత్రల పంపిణీ విజయవంతం చేస్తాం.

– డాక్టర్ ఎస్.ప్రశాంతి, సబ్ డివిజనల్ ఆఫీసర్, రామచంద్రపురం డివిజన్

సన్నద్ధమైన యంత్రాంగం

మండపేట, రామచంద్రపురం నియోజకవర్గాల్లోని 17 పీహెచ్‌సీల పరిధిలోని మొత్తం 667 సంస్థల్లో 82,214 మందికి ఆల్బెండజోల్ మాత్రలను పంపిణీ చేసేందుకు వైద్య, ఆరోగ్య, ఐసీడీఎస్ శాఖలు సన్నద్ధమయ్యాయి. అందుకోసం 904 మంది ఆశ, అంగన్‌వాడీ, వైద్య ఆరోగ్య కార్యకర్తలు పాల్గొననున్నారు. వారిలో 135 మంది ఏఎన్ఎంలు, 337 మంది ఆశ కార్యకర్తలు, 432 మంది అంగన్‌వాడీ కార్యకర్తలు ఉన్నారు. వారిని ఆయా పీహెచ్‌సీల వైద్యాధికారులు పర్యవేక్షించనున్నారు.

పీహెచ్‌సీల వారీగా మాత్రల పంపిణీ ఇలా...

పీహెచ్‌సీ	పంపిణీ చేయాల్సిన సంస్థలు	బాలురు	బాలికలు	మొత్తం
ఆర్సీపురం హరిజనేట	33	2230	2007	4237
ఆర్సీపురం ముచ్చిమిల్లి	40	4364	4035	8399
వెల్ల	26	1296	1449	2745
ద్రాక్షారామ	83	4688	3749	8437
పామర్రు	55	1431	1444	2875
పేకేరు	57	1032	1080	2112
దంగేరు	46	1028	1175	2203
కుందూరు	55	2185	1853	4038
మండపేట హరిజనపేట	25	3204	3499	6703
మండపేట గొల్లపుంత	32	4225	3482	7707
డి.కేశవరం	63	2832	2798	5630
ద్వారపూడి	81	4063	3972	8035
అంగర	52	1905	2143	4048
అచ్యుతాపురం	38	1061	1065	2126
వాకతిప్ప	41	1154	1297	2451
మాచవరం	75	2604	2411	5015
రాయవరం	24	2707	2746	5453
మొత్తం	826	42009	40205	82214

క్లుప్తంగా

మున్సిపల్ చైర్‌పర్సన్‌ను కలిసిన పట్టణ ప్లానింగ్ అధికారి

కపిలేశ్వరపురం (మండపేట): మండపేట మున్సిపల్ పట్టణ ప్లానింగ్ అధికారిగా నూతనంగా బాధ్యతలు చేపట్టిన సుప్రియ గురువారం చైర్‌పర్సన్ పతివాడ నూక దుర్గారాణిని మర్యాదపూర్వకంగా కలిశారు. నిడదవోలు మున్సిపల్ కార్యాలయం నుంచి బదిలీపై ఆమె మండపేట వచ్చారు. పట్టణ ప్రణాళికాభివృద్ధికి కృషి చేయాలని చైర్‌పర్సన్ సూచించారు.

అన్న సమారాధన

కపిలేశ్వరపురం: గ్రామంలోని లంక సానమ్మ ఆలయ 8వ వార్షికోత్సవం సందర్భంగా గురువారం ఆలయం వద్ద అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. అమ్మవారికి మహిళలు కానుకగా చీరలు, రవికలు సమర్పించి మొక్కులు తీర్చుకున్నారు. గ్రామంతోబాటు తాతపూడి, అంగర తదితర గ్రామాల భక్తులు అమ్మవారిని దర్శించుకొని అన్నప్రసాదాన్ని స్వీకరించారు.

ఏజీఎం శ్రీనివాస్‌కు అభినందన సత్కారం


ఏజీఎం శ్రీనివాస్‌ను సత్కరిస్తున్న అధికారులు, సిబ్బంది

రామచంద్రపురం: సుదీర్ఘ కాలం స్థానిక డీసీసీ బ్యాంక్‌లో పని చేసి, ప్రస్తుతం ద్రాక్షారామ, అంగర, కె.గంగవరం బ్రాంచీల నోడల్ ఆఫీసర్‌గా వ్యవహరిస్తున్న సాపిరెడ్డి శ్రీనివాస్ ఏజీఎంగా పదోన్నతి పొందిన సందర్భంగా రామచంద్రపురం బ్రాంచ్‌లో బ్యాంకు, పీఏసీఎస్‌ల సిబ్బంది ఘనంగా సత్కరించారు. బ్యాంక్‌లో గురువారం జరిగిన కార్యక్రమంలో ఆయన సేవలను వక్తలు కొనియాడారు. బ్యాంక్ అభివృద్ధికి ఎంతగానో కృషి చేశారన్నారు. ఇటీవల రావులపాలెం బ్రాంచ్‌కు బదిలీపై వెళ్లిన అసిస్టెంట్ మేనేజర్ వి.దీప్తి గాయత్రిని కూడా సత్కరించారు. కార్యక్రమంలో నోడల్ అధికారి హనుమంతరావు, బ్యాంక్ మేనేజర్ జి.ఫకీర్రావు, సత్యనారాయణ రెడ్డి, సొసైటీ సీఈఓలు దంగేటి ప్రసాద్, మేడిశెట్టి బెనర్జీ, పిల్లి శ్రీనివాసరావు, సలాది శ్రీరాములు, గుత్తుల కృష్ణబాబు, సత్తి రాజారెడ్డి, కొర్ల వెంకటేశ్వరరావు పాల్గొన్నారు.

ఘనంగా పుట్టాలమ్మ జాతర


ప్రత్యేకాలంకరణలో పుట్టాలమ్మ అమ్మవారు

కె.గంగవరం: పామర్రు గ్రామ దేవత పుట్టాలమ్మ అమ్మవారి జాతరను గురువారం ఘనంగా నిర్వహించారు. జాతర సందర్భంగా అమ్మవారికి ప్రత్యేక అలంకరణ చేశారు. ఆలయానికి రంగులు, విద్యుద్దీపాలతో అలంకరించారు. గరగ నృత్యాలతో పాటు, పలు సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించారు. జాతర అనంతరం శుక్రవారం ఆలయం వద్ద తీర్థం నిర్వహించనున్నారు.

శరవేగంగా నరజాడ-కూళ్ల రోడ్డు పనులు


కొనసాగుతున్న రహదారి నిర్మాణ పనులు

కె.గంగవరం: మండలంలోని నరజాడ-కూళ్ల రహదారికి మహర్దశ నెలకొంది. కొన్నేళ్లుగా ఈ రహదారి గుంతలమయంగా మారడంతో రెండు గ్రామాల ప్రజలు నానా ఇబ్బందులు పడ్డారు. ఇటీవల రాజ్యసభ సభ్యుడు పిల్లి సుభాష్‌చంద్రబోస్ గ్రామ పర్యటన చేసే క్రమంలో, ఈ రహదారి సమస్యను గ్రామస్తులు ఆయన దృష్టికి తీసుకువెళ్లారు. వెంటనే స్పందించిన ఆయన ఎన్ఆర్‌జీఎస్ నిధుల నుంచి రూ.50 లక్షలు మంజూరు చేయించారు. నిధులు మంజూరు చేయడంతో పాటు, రహదారి నిర్మాణ పనులు వెంటనే జరపాలని ఆదేశాలు కూడా ఇచ్చారు. దీంతో నాలుగు రోజులుగా రహదారి నిర్మాణ పనులు శరవేగంగా జరుగుతున్నాయి. రెండు వారాల్లో పనులు పూర్తి చేసి, రహదారిని ప్రారంభిస్తామని కాంట్రాక్టర్ తెలిపారు.

ఘనంగా జాకిర్ హుస్సేన్ జయంతి

కాజులూరు: మాజీ రాష్ట్రపతి డాక్టర్ జాకిర్ హుస్సేన్ జయంతిని గురువారం చేదువాడలో స్థానికులు ఘనంగా నిర్వహించారు. ముస్లిం మహిళలు, స్థానిక పెద్దలు ఆయన చిత్రపటానికి నివాళులర్పించారు. మండల ముస్లిం మైనార్టీ సంఘం నాయకులు ఎంఆర్ హుస్సేన్ ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో అమలాపురం శెట్టిబలిజ సంక్షేమ సంఘం కన్వీనర్ కడలి రాంపండు, డాక్టర్ శ్రావణి తదితరులు మాట్లాడారు. మహాత్మా గాంధీ అడుగుజాడల్లో నడచిన డాక్టర్ జాకిర్ హుస్సేన్ స్వాతంత్ర్యానంతరం అలీగఢ్ ముస్లిం యూనివర్సిటీ వైస్ చాన్సలర్‌గా, ఎంపీగా, బీహార్ గవర్నర్‌గా, ఉప రాష్ట్రపతిగా, దేశ రాష్ట్రపతిగా ఆయన ఎనలేని సేవలు చేశారని కొనియాడారు.

అభివృద్ధి చేశాం.. ప్రజల ముందుకెళ్తున్నాం

టీడీపీ నాయకుల విమర్శలను ఖండించిన వైఎస్సార్ సీపీ నాయకులు


ఏడిదలో మాట్లాడుతున్న సర్పంచ్ ఆశీర్వాదం, నాయకులు

కపిలేశ్వరపురం (మండపేట): ఏడిద గ్రామంలో వైఎస్సార్ సీపీ హయాంలో అమలు చేసిన సంక్షేమమూ, ఎమ్మెల్సీ తోట త్రిమూర్తులు చొరవతో చేపట్టిన అభివృద్ధి పనులను వివరిస్తూ తాము ప్రజల్లోకి వెళ్తున్నామని వైఎస్సార్ సీపీ గ్రామ ప్రజాప్రతినిధులు, నాయకులు అన్నారు. ఇటీవల వైఎస్సార్ సీపీ నేతలపై టీడీపీ గ్రామ నేతలు చేసిన ఆరోపణలను గ్రామంలో గురువారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఖండించారు. సర్పంచ్ బూరిగ ఆశీర్వాదం, ఎంపీటీసీ సభ్యులు పట్నాల నాగబాబు, చొల్లంగి రామారావు, ఉప సర్పంచ్ చంద్ర శ్రీనివాస్, పీఏసీఎస్ చైర్మన్ రామిశెట్టి శ్రీహరిబాబు, వైఎస్సార్ సీపీ గ్రామ అధ్యక్షుడు పలివెల సుధాకర్, రాష్ట్ర చేనేత విభాగం ప్రధాన కార్యదర్శి బేతా వెంకటేశ్వరరావు, ఏఎంసీ డైరెక్టర్ ముగ్గళ్ల పార్థసారథి మాట్లాడారు. ప్రతిపక్ష టీడీపీ నేతలు గతంలో చేసిందేమీలేక వైఎస్సార్ సీపీ నేతలపై విమర్శలకు పరిమితమవుతున్నారన్నారు. రైతులు తమ సమస్యను చెప్పుకున్న వెంటనే ఎమ్మెల్సీ తోట త్రిమూర్తులు స్పందించి నిధులను మంజూరు చేయడంతో గ్రామంలోని పుంత రహదారులు మెరుగుపడ్డాయని గుర్తు చేశారు. వ్యవసాయ ఉత్పత్తులను రైతులు తరలించుకునేందుకు ఎమ్మెల్సీ తోట కృషి దోహదపడిందన్నారు. రజక చెరువులు అధ్వానంగా ఉన్నాయని చెప్పగానే ఎమ్మెల్సీ తోట చొరవతో రూ.20 లక్షల మండల పరిషత్ నిధులతో మెరుగుపర్చిన సంగతి టీడీపీ నాయకులు తెలుసుకోవాలన్నారు. బీసీ సామాజిక వర్గీయుల విజ్ఞప్తిపై కమ్యూనిటీ హాల్ నిర్మాణానికి రూ.10లక్షలు నిధులు మంజూరైన సంగతి గుర్తించాలన్నారు. ఇకనైనా మంచిపై విమర్శలు చేయడాన్ని విడనాడి ప్రజలకు ఏం చేస్తారో చెప్పాలని వైఎస్సార్‌సీపీ నాయకులు హితవు పలికారు. కార్యక్రమంలో వార్డు సభ్యులు, నాయకులు పాల్గొన్నారు.

మహిళల ఆర్థికాభివృద్ధే జగన్ లక్ష్యం

ఎంపీ సుభాష్‌చంద్ర బోస్


ఆసరా చెక్కును అందిస్తున్న ఎంపీ బోస్, కో-ఆర్డినేటర్ సూర్యప్రకాశ్

రామచంద్రపురం: రాష్ట్రం అభివృద్ధి చెందాలంటే మహిళల ఆర్థిక స్వావలంబన ఎంతో అవసరమని, తద్వారా వారు ఆర్థికాభివృద్ధి సాధించేలా ఆసరా పథకాన్ని ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి తీసుకువచ్చారని రాజ్యసభ సభ్యుడు పిల్లి సుభాష్ చంద్రబోస్ అన్నారు. పట్టణంలోని లయన్స్ కల్యాణ మండపంలో గురువారం మెప్మా ఆధ్వర్యంలో నాలుగో విడత ఆసరా సంబరాలను నిర్వహించారు.మున్సిపల్ చైర్‌పర్సన్ గాధంశెట్టి శ్రీదేవి అధ్యక్షత వహించారు. కార్యక్రమానికి ఎంపీ బోస్‌తో పాటు, వైఎస్సార్ సీపీ నియోజకవర్గ కో–ఆర్డినేటర్ పిల్లి సూర్యప్రకాశ్ ముఖ్యఅతిథులుగా హాజరయ్యారు. ఎంపీ బోస్ మాట్లాడుతూ పట్టణంలో నాలుగో విడత ఆసరా ద్వారా 627 సంఘాలకు రూ.5.71 కోట్లను విడుదల చేసినట్టు చెప్పారు. సీఎం జగన్‌మోహన్‌రెడ్డి మహిళల పక్షపాతి అని, మహిళలకు 50 శాతం సమాన హక్కులను కల్పించటంలో, పథకాలను ప్రజలకు అందించటంలోను దేశంలోనే అగ్ర స్థానంలో ఉన్నారన్నారు. కో–ఆర్డినేటర్ సూర్యప్రకాశ్ మాట్లాడుతూ గత ఎన్నికలకు ముందు ఇచ్చిన హామీలను కచ్చితంగా అమలు చేశారన్నారు. ఇచ్చిన హామీలన్నీ అమలు చేసి, ప్రతి ఇంటికి వెళ్లి చేసిన లబ్ధిని వివరిస్తున్న ఘనత వైఎస్సార్ సీపీదేనన్నారు. ఈ సందర్భంగా మహిళా సంఘాలకు ఆసరా చెక్కును ఎంపీ బోస్, సూర్యప్రకాశ్‌లు అందజేశారు. వైస్ చైర్మన్లు కోలమూరి శివాజీ, చింతపల్లి నాగేశ్వరరావు, కమిషనర్ బి.శ్రీనివాసులు, డీఈ డి.దుర్గాప్రసాద్, మెప్మా పర్యవేక్షణాధికారి కె.మోహన్‌కుమార్, మెప్మా టీఎంసీ ఓ.మంగాదేవి, సీఓలు, ఆర్పీలు, కౌన్సిలర్లు, పార్టీ పట్టణ కన్వీనర్ గాధంశెట్టి శ్రీధర్ తదితరులు పాల్గొన్నారు.

అందరికీ సంక్షేమ ఫలాలు

- అదే ప్రభుత్వ లక్ష్యం..
- గడప గడపకూ.. కార్యక్రమంలో కో–ఆర్డినేటర్ సూర్యప్రకాశ్


కో–ఆర్డినేటర్ సూర్యప్రకాశ్‌కు స్వాగతం పలుకుతున్న మహిళలు. చిత్రంలో ఎంపీ బోస్

రామచంద్రపురం: అర్హత ఉన్న ప్రతి కుటుంబానికీ ప్రభుత్వం అందిస్తున్న సంక్షేమ ఫలాలు పారదర్శకంగా, దళారుల్లేకుండా నేరుగా అందాలనేదే ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి లక్ష్యమని వైఎస్సార్ సీపీ నియోజకవర్గ కో–ఆర్డినేటర్ పిల్లి సూర్యప్రకాశ్ అన్నారు. పట్టణంలోని బ్రాడీపేటలో గురువారం గడప గడపకూ మన ప్రభుత్వం కార్యక్రమంలో రాజ్యసభ సభ్యుడు పిల్లి సుభాష్‌చంద్రబోస్, కో–ఆర్డినేటర్ సూర్యప్రకాశ్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా ప్రతి ఇంటికీ వెళ్లి, వారు పొందిన ప్రభుత్వ పథకాల వివరాలను వివరించారు. సచివాలయ పరిధిలో ఎదుర్కొంటున్న సమస్యలను ప్రజల నుంచి తెలుసుకుని, వాటి పరిష్కారానికి అధికారులను ఆదేశించారు. ఈ సందర్భంగా సూర్యప్రకాశ్ మాట్లాడుతూ పేద, బడుగు, బలహీన వర్గాల అభ్యున్నతికి ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి నవరత్నాల పథకాలను ప్రవేశపెట్టారన్నారు. ఈ క్రమంలోనే పేదలందరికీ ఇళ్లు కార్యక్రమంలో భాగంగా అర్హులైన ప్రతిఒక్కరికీ ఇంటి నిర్మాణం చేస్తున్నట్టు వివరించారు. ప్రభుత్వ పాలనను సచివాలయ వ్యవస్థ ద్వారా ప్రతి ఇంటికీ వైఎస్సార్ సీపీ ప్రభుత్వం తీసుకువచ్చిందని చెప్పారు. ప్రతిఒక్కరూ ప్రభుత్వ పథకాలను సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ఈ సందర్భంగా బ్రాడీపేటలో ప్రతి ఇంటి వద్ద సూర్యప్రకాశ్‌కు మహిళలు హారతులు, పూలదండలతో ఘనంగా స్వాగతం పలికారు. మున్సిపల్ చైర్‌పర్సన్ గాధంశెట్టి శ్రీదేవి, వార్డు కౌన్సిలర్ కేతా సుజాత, వైస్ చైర్మన్లు కోలమూరి శివాజీ, చింతపల్లి నాగేశ్వరరావు, కౌన్సిలర్లు కేతా శ్రీను, నల్లా అంజమ్మ, కో ఆప్షన్ సభ్యుడు మస్తాన్, పార్టీ పట్టణ కన్వీనర్ గాధంశెట్టి శ్రీధర్, నేతలు కోటి దుర్గారావు, సూరంపూడి రాంబాబు, వద్దాది సత్తిబాబు, జుత్తుగ గులాంబాషా, వల్లు శివ తదితరులు పాల్గొన్నారు.

మాత్రల పంపిణీకి ఏర్పాట్లు


చెల్లూరులో పోస్టర్‌తో హెచ్‌ఎం రాజేశ్వరి, వైద్య ఆరోగ్య శాఖ సిబ్బంది

రాయవరం: జాతీయ నులిపురుగుల నివారణ దినోత్సవాన్ని శుక్రవారం మండలంలో నిర్వహించేందుకు వైద్య ఆరోగ్య శాఖ అధికారులు ఏర్పాట్లు చేస్తున్నారు. రాయవరం, మాచవరం పీహెచ్‌సీల పరిధిలోని ప్రభుత్వ, ప్రైవేట్ పాఠశాలల్లో చదువుతున్న విద్యార్థులకు, ఒకటి నుంచి 19 సంవత్సరాల లోపు వారికి నులి పురుగుల నివారణకు ఆల్బెండజోల్ మాత్రలను అందజేయనున్నారు. దీనిపై విద్యార్థులకు అవగాహన కల్పించేందుకు గురువారం పీహెచ్‌సీ వైద్యాధికారులు ఎం.శ్రీనివాస్, కె.మణికంఠ, రమ్యశ్రీ అవగాహన కల్పించారు. ఆల్బెండజోల్ 400 ఎంజీ మాత్రలు మండల వ్యాప్తంగా ఉన్న చిన్నారులు, విద్యార్థులకు పంపిణీ చేయనున్నట్టు వారు తెలిపారు. 1–2 సంవత్సరాల పిల్లలకు 1/2 మాత్ర, 2 నుంచి 19 సంవత్సరాల పిల్లలకు 400 ఎంజీ మాత్రను మధ్యాహ్నం భోజనం చేసిన తర్వాత మింగించాలని వైద్యాధికారులు సూచించారు. ఈ సందర్భంగా జాతీయ నులిపురుగుల నివారణ పోస్టర్‌ను ఆవిష్కరించారు.

నేడు రాయవరంలో ధ్యాన శిక్షణ

రాయవరం: భగవద్గీతలోని సత్యాలు అందరికీ అర్థమయ్యే రీతిలో ఆత్మజ్ఞానాన్ని అందించేందుకు ధ్యాన శిక్షణ కార్యక్రమాన్ని రాయవరంలో శుక్రవారం ఏర్పాటు చేశారు. ఈ విషయాన్ని యోగా గురువు వెలగల ఫణికృష్ణారెడ్డి గురువారం విలేకరులకు తెలిపారు. స్థానిక సత్యసాయి సేవా మందిరం వద్ద ఉదయం 10 నుంచి సాయంత్రం నాలుగు గంటల వరకు ధ్యాన శిక్షణ నిర్వహిస్తున్నట్టు తెలిపారు. ఆత్మజ్ఞానాన్ని అందించేందుకు ఆధ్యాత్మికవేత్తలు గీతాలక్ష్మి, రాజ్యలక్ష్మి ధ్యాన శిక్షణనిస్తారన్నారు.

వైభవంగా రావులమ్మ పంట జాతర

అంబాజీపేట: గంగలకుర్రు అగ్రహారంలో ఉన్న రావులమ్మ అమ్మవారి పంట జాతరను గురువారం రాత్రి వైభవంగా నిర్వహించారు. ఏటా రావులమ్మ అమ్మవారి పంట జాతరను నిర్వహించడం వల్ల పంటలు బాగా పండుతాయని గ్రామస్తుల విశ్వాసం. ఇందులో భాగంగా అమ్మవారికి చలివిడి, పానకాలు, ముడుపులు, మొక్కుబడులు చెల్లించుకున్నారు. జాతర సందర్భంగా ఏర్పాటు చేసిన సాంస్కృతిక కార్యక్రమాలు ఆకట్టుకున్నాయి.

డిగ్రీలో ప్రవేశానికి విద్యార్థులకు అవగాహన

రావులపాలెం: ప్రభుత్వ కళాశాలల్లో చేరిన విద్యార్థులు ప్రభుత్వం అందిస్తున్న అన్ని సదుపాయాలను పొందటంతో పాటు, ఉన్నత స్థానాలకు చేరుకోవచ్చని డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ చప్పిడి కృష్ణ అన్నారు. గురువారం స్థానిక జూనియర్ కళాశాల సెకండియర్ విద్యార్థులకు డిగ్రీ కళాశాలలో అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. రాష్ట్ర కళాశాల విద్యా కమిషనర్ ఆదేశాల మేరకు ప్రభుత్వ జూనియర్ కళాశాల రావులపాలెంలో చదువుతున్న సెకండియర్ విద్యార్థులకు ఓపెన్ డే (డిగ్రీ మొదటి సంవత్సరంలో చేరేందుకు అవగాహన సదస్సు) ఏర్పాటు చేశారు. ప్రిన్సిపాల్ కృష్ణ మాట్లాడుతూ డిగ్రీ ఫస్టియర్‌లో చేరే ప్రతి విద్యార్థి కూడా అవగాహనతో, ఆలోచించుకుని, చదివే గ్రూపును నిర్ణయించుకోవాలన్నారు. మంచి విద్యాబోధన అందించే ప్రభుత్వ కళాశాలను ఎంచుకోవాలన్నారు. ప్రభుత్వ నిబంధనల మేరకు స్కాలర్‌షిప్ సదుపాయాలు వర్తిస్తాయన్నారు. ప్రస్తుతం రాష్ట్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన మేజర్, మైనర్, సబ్జెక్టులను ఎంచుకుని, తద్వారా ఉన్నత స్థానాలకు చేరాలని చెప్పారు.

రైతు శ్రేయస్సుకే డీసీసీబీ సేవలు

కాజులూరు: డీసీసీ బ్యాంక్ గోల్డ్‌లోన్ సదుపాయాన్ని ప్రజలు, రైతులు సద్వినియోగం చేసుకోవాలని గొల్లపాలెం కో–ఆపరేటివ్ బ్యాంక్ బ్రాంచ్ మేనేజర్ నున్న మాచరరావు కోరారు. వాణిజ్య బ్యాంకుల్లాగే అన్ని రకాల బ్యాంకింగ్ సేవలను డీసీసీబీ ప్రజలకు అందుబాటులోకి తెచ్చిందని గురువారం ఓ ప్రకటనలో పేర్కొన్నారు. రైతు శ్రేయస్సును దృష్టిలో ఉంచుకుని తమ బ్యాంక్ పని చేస్తుందన్నారు.

నేడు జగనన్న ఆరోగ్య సురక్ష

రాయవరం: వెంటూరు సచివాలయం–2 పరిధిలో జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమాన్ని శుక్రవారం నిర్వహించనున్నారు. ఈ విషయాన్ని ఎంపీపీ నౌడు వెంకటరమణ గురువారం విలేకరులకు తెలిపారు. ప్రజాప్రతినిధులు, అధికారులు కార్యక్రమంలో పాల్గొనాలన్నారు.

కనీస వేతనం చెల్లించాలని వినతి

రాయవరం: ఆశ వర్కర్లకు కనీస వేతనం చెల్లించాలని కోరుతూ ఆశ వర్కర్లు గురువారం వినతి పత్రాన్ని అందజేశారు. స్థానిక తహసీల్దారు కార్యాలయంలో డిప్యూటీ తహసీల్దారు విజయరేఖకు ఆశ వర్కర్ల అసోసియేషన్ ఆధ్వర్యంలో అందజేశారు. పనిభారాన్ని తగ్గించాలని, ప్రభుత్వ సెలవులు అమలు చేయాలని, రిటైర్మెంట్ బెనిఫిట్స్ కల్పించాలని, గ్రూపు ఇన్సూరెన్స్ సౌకర్యం కల్పించాలని, సంక్షేమ పథకాలు అమలు చేయాలని కోరుతూ వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో ఆశ వర్కర్ల యూనియన్ ఉపాధ్యక్షురాలు జి.బేబి, ఆశ వర్కర్లు జి.రామలక్ష్మి, ఆర్.గీతాంజలి, కె.పాపయ్యమ్మ, జి.సూర్యకుమారి, ఎస్.మణిజ్యోతి, ఎ.సూర్యావతి, ఎస్.లచ్చమ్మ, ఆర్.జానకి, జి.సుజాత, డి.సత్య, వై.సరోజ తదితరులు పాల్గొన్నారు.

అధికారుల తీరుపై ఆగ్రహం

- కార్యక్రమాలు, పర్యటనల సమాచారం ఇవ్వడం లేదంటూ ప్రజాప్రతినిధుల ధ్వజం
- సమన్వయంతో ముందుకు వెళ్లాలని ఎంపీపీ, జెడ్పీటీసీ సూచన


సమావేశంలో మాట్లాడుతున్న జెడ్పీటీసీ అబ్బు

కపిలేశ్వరపురం: గ్రామాల్లో ప్రభుత్వ శాఖల అధికారులు వారి పర్యటనలు, శాఖాపరమైన సమాచారాన్ని ఇవ్వడంలేదంటూ మండల పరిషత్ సభ్యులు, సర్పంచులు ఆగ్రహం వ్యక్తం చేశారు. స్థానిక మండల పరిషత్ సమావేశ మందిరంలో గురువారం ఎంపీపీ మేడిశెట్టి సత్యవేణి అధ్యక్షతన మండల సాధారణ సమావేశం నిర్వహించారు. ఎంపీడీఓ ఎం.రామకృష్ణారెడ్డి సమావేశంలో అజెండాను వివరించారు. పీఎం కిసాన్ పథకం నిర్వహణలో సాంకేతిక సమస్యలు తలెత్తుతున్నాయని ఏఓ రమేష్‌కుమార్ దృష్టికి తీసుకెళ్లగా పరిష్కరిస్తామని హామీ ఇచ్చారు. బొండాలు రకం సాగును ప్రభుత్వం ప్రోత్సహించడంలేదన్న విషయాన్ని గుర్తించాలని ఏఓ స్పష్టం చేశారు. నాడు–నేడు సమాచారాన్ని ఇవ్వాలని కోరినప్పటికీ ఎంఈఓ తాతారావు నిర్లక్ష్యం చేస్తున్నారని పలువురు సభ్యులు సభకు తెలిపారు. తాగునీటి సమస్యలను, మినీ గోకులాల బిల్లులు బకాయిలపై సభ్యులు పలివెల మధు, అడ్డాల శ్రీనివాస్, లంక గ్రామాల సమస్యలపై వైస్ ఎంపీపీ సాకా శ్రీనివాస్, యర్రంశెట్టి నాగేశ్వరరావు మాట్లాడారు. జెడ్పీటీసీ పుట్టపూడి అబ్బు మాట్లాడుతూ అధికారులు సమన్వయంతో వ్యవహరిస్తూ మండలాన్ని అభివృద్ధి చేయాలన్నారు. ప్రజాప్రతినిధులు అడుగుతున్న సమాచారాన్ని ఇవ్వడంలో విస్మరించడం సరికాదన్నారు. సమావేశంలో వైస్ ఎంపీపీ గుణ్ణం భాను ప్రసాద్, సభ్యులు, సర్పంచ్‌లు, పీఏసీఎస్ చైర్మన్లు, ప్రభుత్వ శాఖల అధికారులు పాల్గొన్నారు.

ఎలుకల మందు పంపిణీ


బ్రోమోడయోలిన్ మిశ్రమాన్ని అందజేస్తున్న ప్రజాప్రతినిధులు

కపిలేశ్వరపురం (మండపేట): మండపేట మండలంలోని కేశవరంలో పీఏసీఎస్ చైర్మన్ ముక్కపాటి శ్రీనివాస్ చేతుల మీదుగా రైతులకు ఎలుకల నివారణ నిమిత్తం బ్రోమోడయోలిన్ మందు మిశ్రమాన్ని పంపిణీ చేశారు. ఆర్బీకే వ్యవసాయ సహాయకులు బాలకృష్ణ, పవన్ మందు మిశ్రమాన్ని వ్యవసాయ క్షేత్రంలో వినియోగించే పద్ధతిపై రైతులకు అవగాహన కల్పించారు. కార్యక్రమంలో మండల సాగుసలహా మండలి చైర్మన్ అన్నందేవుల చంద్రరావు, ఆదర్శ రైతు సలాది శివ, మాజీ ఎంపీటీసీ తుపాకుల ప్రసన్నకుమార్, పీఏసీఎస్ సిబ్బంది వుండమట్ల శేఖర్, నరేంద్రపురపు త్రిమూర్తులు పాల్గొన్నారు.

జాతీయ టెన్నికాయిట్ పోటీలకు విద్యార్థులు


విద్యార్థులను అభినందిస్తున్న ఉపాధ్యాయులు

కపిలేశ్వరపురం (మండపేట): మండపేటలోని ఎస్‌వీఎస్ఆర్ ప్రభుత్వ ఉన్నత పాఠశాల తొమ్మిదో తరగతి విద్యార్థి బళ్లా సత్యనారాయణ, ఏడో తరగతి విద్యార్థి కొల్లి అజయ్ ప్రతిభ కనబర్చారు. ఇటీవల జంగారెడ్డిగూడెంలో నిర్వహించిన 67వ రాష్ట్ర స్థాయి ఎస్‌జీఎఫ్ ఏపీ పోటీల్లో అండర్–14 టెన్నికాయిట్ విభాగంలో తమ పాఠశాల విద్యార్థులు జాతీయ స్థాయి పోటీలకు ఎంపికైనట్టు హెచ్‌ఎం ఆర్ నాగకుమార్ తెలిపారు. ప్రతిభ కనబర్చిన విద్యార్థులను, తర్ఫీదునిచ్చిన పీఈటీ చొల్లంగి లక్ష్మీ శ్రీనివాసరావులను హెచ్‌ఎం నాగకుమార్, ఉపాధ్యాయులు సీహెచ్‌వీవీ సత్యనారాయణ, ఐఎస్ఎస్ ప్రసాద్, విద్యార్థులు అభినందించారు.

నేడు మాచవరంలో గడప గడపకూ..

రాయవరం: మాచవరంలో శుక్రవారం గడప గడపకూ మన ప్రభుత్వం కార్యక్రమాన్ని నిర్వహించనున్నారు. ఈ విషయాన్ని ఎంపీపీ నౌడు వెంకటరమణ గురువారం విలేకరులకు తెలిపారు. మధ్యాహ్నం మూడు గంటలకు జరిగే గడప గడపకూ మన ప్రభుత్వం కార్యక్రమంలో ఎమ్మెల్సీ తోట త్రిమూర్తులు ముఖ్య అతిథిగా హాజరవుతారన్నారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ, మండల ఉపాధ్యక్షులు, ఎంపీటీసీ సభ్యులు, సర్పంచ్‌లు, సొసైటీ అధ్యక్షులు, మండల స్థాయి అధికారులు, ప్రజాప్రతినిధులు హాజరు కావాలని ఆయన పిలుపునిచ్చారు.